సాక్షి ఖమ్మం

బుధవారం ౹ 15 ౹ అక్టోబర్ ౹ 2025



అసౌకర్యాల నడుమే...

ముదిగొండ మండలం యడవల్లిలో పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. IIలో



పకడ్బందీగా చట్టం అమలు

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చట్టాలను పకడ్బందీగా అమలుచేస్తూ అనుమతులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. IIలో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం పెరిగే అవకాశముంది. కొన్నిచోట్ల మధ్యాహ్నం ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరుతుంది.



లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు



బంతిపూల తోటను కమ్మేసిన మంచు



మంచు కురుస్తుండగానే రోడ్లు శుభ్రం చేస్తున్న కార్మికురాలు

మంచు కురిసే వేళలో..

దాదాపు ప్రతీరోజు ఏదో ఒక సమయాన వర్షం కురుస్తోంది. మరోపక్క చలికాలం మొదలుకావడంతో మంచు ప్రభావం కనిపిస్తోంది. తెల్లవారుజామున మంచు తెరలు కమ్మేస్తుండగా.. ఆ మార్గాల్లో వెళ్తున్న వారికి ఆహ్లాదాన్ని పంచుతోంది. మంచు కురుస్తున్న సమయాన పొలాలు, పూల తోటలు మరింత అందాన్ని అద్దుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున కనిపించిన దృశ్యాలే ఇవి..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

జిల్లాలో వికసిత్ భారత్ పాదయాత్ర

ఖమ్మం రాపర్తినగర్: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన 'మై భారత్' నేతృత్వంలో వికసిత్ భారత్ పేరిట పాదయాత్ర నిర్వహించనున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ తెలిపారు. ఖమ్మంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశమంతా పాదయాత్రలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈమేరకు జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గాల్లో త్వరలోనే మూడు రోజుల పాటు నుంచి యాత్ర ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు https//mybharta.gov.in ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, జిల్లా అధికారి ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో పంటగా అపరాలతో లాభాలు



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ సుచరితాదేవి

వైరా: పత్తి, వరి సాగు చేస్తున్న రైతులు రెండో పంటగా అపరాలు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేటివ్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, మధిర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితాదేవి మాట్లాడారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. అలాకాకుండా భూమిలో దున్నితే భూసారం పెరిగి రైతులపై ఎరువుల భారం తగ్గుతుందని తెలిపారు. ఆతర్వాత పంటలను ఆశిస్తున్న చీడపీడలు, వాటి నివారణ, మధిర ఏఆర్ఎస్ ద్వారా అందుబాటులో ఉన్న వంగడాలు, కేవీకే ద్వారా అందే సేవలను వివరించారు. వైరా ఏడీఏ టి.కరుణశ్రీ, రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌తోనే పత్తి కొనుగోళ్లు



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: పత్తి సాగుచేసిన రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని, తద్వారా సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లకు అవకాశముంటుందని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. మండలంలోని మద్దులపల్లిలోని పత్తి చేన్లను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. రైతులు పత్తితీత విషయంలో జాగ్రత్తలు పాటిస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఏఓ తారాదేవి, రైతులు పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యాసంవత్సరానికి ప్లస్ వన్(11వ తరగతి)లో ఖాళీ సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తు గడువును పొడిగించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మక్కల కొనుగోళ్లకు సిద్ధం

ఉమ్మడి జిల్లాలో 98,554 ఎకరాల్లో సాగు

- ఇప్పుడిప్పుడే మొదలవుతున్న కోతలు
- మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లకు ప్రభుత్వ నిర్ణయం
- త్వరలోనే జిల్లా పర్చేజింగ్ కమిటీల సమావేశాలు



ఇల్లెందు మండలం మస్సివాగు గ్రామం వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో సాగైన మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించేలా ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే పంట కోతలు జోరందుకుంటున్నాయి. వారం, పది రోజుల్లో కలెక్టర్ల ఆధ్వర్యాన జిల్లా పర్చేజింగ్ కమిటీల సమావేశాలు నిర్వహించి పంట సాగు ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

భద్రాద్రి జిల్లాలో అత్యధికం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 98,554 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఇందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 96,864 ఎకరాల్లో సాగు చేయగా, ఖమ్మం జిల్లాలో కేవలం 1,690 ఎకరాల్లోనే సాగు చేశారు. భద్రాద్రి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, పినపాక, మణుగూరు, ఆళ్లపల్లి, పాల్వంచ, బూర్గంపాడు ప్రాంతాల్లో సాగు ఎక్కువగా ఉంది. ఖమ్మం జిల్లాలో నీటి వనరులు అధికంగా ఉండటంతో ఇతర పంటలు సాగవుతున్నాయి. యాసంగిలో మాత్రం ఖమ్మం జిల్లాలోనూ మొక్కజొన్న సాగు అధికంగా ఉంటుంది. కాగా, భద్రాద్రి జిల్లాలో పంట సాగు ఆధారంగా 2,42,160 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

ఏజెన్సీలో జోరుగా సాగు

భద్రాద్రి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉంది. గుండాల మండలంలో అధికారికంగా 30వేల ఎకరాల్లో, అనధికారికంగా సుమారు 40వేల ఎకరాల్లో పంట సాగవుతున్నట్లు అంచనా. ఆళ్లపల్లి మండలంలో అధికారికంగా 15వేలు, అనధికారికంగా 20వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గతంలో డ్వాక్రా మహిళలు, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోళ్లు జరిగేవి. కానీ మూడేళ్లుగా మద్దతు ధర లేకపోవడంతో నిలిపివేశారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దే ధర ఎక్కువగా ఉండడంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధరను రూ.2,400కు పెంచింది. ప్రైవేట్ వ్యాపారులు మరింత పెంచితే రైతులు వ్యాపారులకే విక్రయించే అవకాశముంది. ప్రస్తుతానికైతే వ్యాపారులు రూ.2వేలలోపే కొనుగోలు చేస్తుండగా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే రైతులు వస్తారని భావిస్తున్నారు.

23 కేంద్రాలకు ప్రతిపాదన

మొక్కజొన్న రైతులకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయించనుంది. ఈమేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వాన జిల్లా స్థాయి పర్చేజింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తారు. పంట సాగు ఆధారంగా భద్రాద్రి జిల్లాలో 20, ఖమ్మం జిల్లాలో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆయా కేంద్రాల్లో సుమారు 30శాతం పంటను కొనుగోలు చేసే అవకాశముందని సమాచారం. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో పీఏసీఎస్‌లు, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ద్వారా మక్కల కొనుగోళ్ల ప్రక్రియ చేపడతారు.

రూ.2,400 మద్దతు ధర

గత ఏడాది క్వింటా మొక్కజొన్నలకు రూ.2,225 మద్దతు ధర ఉండగా, ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.2,400గా ప్రకటించింది. వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న కోతలు మొదవుతుండగా.. రైతులు తేమ తగ్గేలా కల్లాల్లో ఆరబోస్తున్నారు. అయితే, ప్రభుత్వ కొనుగోళ్లు మొదలుకాకపోవడంతో కొన్నిచోట్ల వ్యాపారులు క్వింటాకు రూ.2 వేల లోపే ధరతో కొనుగోలు చేస్తున్నారు. ఈనేపథ్యాన మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే రైతులకు లాభం జరగనుంది.

సాగు ప్రాంతాల్లో కేంద్రాలు



ఉమ్మడి జిల్లాలో మక్కల కొనుగోళ్లకు చర్యలు మొదలయ్యాయి. పర్చేజింగ్ కమిటీ సమావేశాల అనంతరం ప్రక్రియ మొదలవుతుంది. పంట సాగు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాం. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.2,400 మద్దతు ధరతో కొనుగోళ్లు ఉంటాయి.

– సునీత, మేనేజర్, మార్క్‌ఫెడ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

పిల్లలను బయటకు పంపితే చర్యలు

'బీఏఎస్‌పై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: బకాయిల పేరిట విద్యార్థినులను బయటకు పంపే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్)పై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీఏఎస్ కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులను బకాయిల పేరిట యాజమాన్యాలు ఇబ్బంది పెట్టకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఈ విషయంలో తల్లిదండ్రులను బలవంతం చేస్తే తీవ్రంగా పరిగణించాలని చెప్పారు. ఈ వీసీలోజిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఉద్యోగులు ఏ.నారాయణరెడ్డి, శ్రీనివాసరావు సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో కార్యాలయాల సముదాయం

ఖమ్మంరూరల్: సకల సౌకర్యాలతో ఖమ్మం రూరల్ మండల కార్యాలయాల సముదాయాన్ని నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి తరుణీహాట్‌లో నిర్మించనున్న సముదాయంపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. కార్యాలయాలన్నీ ఒకేచోట అన్ని వసతులతో ఉండేలా నమూనా సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే, అంతర్గత రహదారులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పార్కింగ్, తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈసమావేశంలో ఆర్అండ్‌బీ డీఈ భగవాన్, ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' భూసేకరణపై సమీక్ష

ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ భూమి సేకరణపై కలెక్టర్ అనుదీప్ అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,138 ఎకరాల అటవీ శాఖ భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే జలవనరుల శాఖ ద్వారా వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమిలో ఖాళీ స్థలాలను అటవీశాఖకు బదలాయించి, అందుకు బదులు ఆ శాఖ భూమి తీసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఉద్యోగులు రమేష్‌రెడ్డి, బాబురావు, కిషోర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ క్రమశిక్షణే ప్రామాణికం

డీసీసీ అధ్యక్ష ఎంపికపై ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రన్

ఖమ్మంరూరల్/కూసుమంచి: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు పార్టీలో క్రమశిక్షణగా ఉండడమే ప్రధాన అర్హత అని ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్ష పదవిపై పాలేరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల అభిప్రాయాలు సేకరించేందుకు ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి, కూసుమంచిలో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. నాలుగు మండలాల పార్టీ శ్రేణులు హాజరైన ఈ సమావేశాల్లో మహేంద్రన్ మాట్లాడారు. పార్టీ భవిష్యత్‌కు తోడు క్రమశిక్షణే ఆధారంగా అధ్యక్ష పదవి ఎంపిక ఉంటుందని తెలిపారు. ఈ క్రమాన అందరికీ ఆమోదయోగ్యమైన నేతను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అనంతరం మండలాల వారీగా నాయకులను ఒక్కరొక్కరుగా పిలిచి అభిప్రాయాలు సేకరించారు. మొదటి నుండి కాంగ్రెస్‌ను అట్టిపెట్టుకుని, అధికారం ఉన్నా, లేకున్నా కొనసాగుతున్న నాయకుల వివరాలు ఆరా తీసినట్లు తెలిసింది. ఈమేరకు డీసీసీ అధ్యక్ష పదవి కోసం మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి తదితరులు దరఖాస్తు చేసుకుని పార్టీలో తమ పాత్రను వివరించారు. ఇంకా ఈసమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గ పరిశీలకుడు చకిలం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ఓలో నమోదుకు అవకాశం

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా ఈ ఏడాది నవంబర్ 1నుంచి 2026 ఏప్రిల్ 30వరకు ఉద్యోగుల నమోదుకు ఉన్న అవకాశాలపై ప్రచారం చేస్తున్నట్లు వరంగల్ రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 వై.డీ.శ్రీనివాస్ తెలిపారు. 2017 జూలై 1నుంచి 2025 అక్టోబర్ 31మధ్య సంస్థలో చేరిన, ఈపీఎఫ్ఓలో నమోదు కాని ఉద్యోగుల వివరాలను సంస్థలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

యూనివర్సిటీ అభివృద్ధి అందరి బాధ్యత

కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాపరెడ్డి



ఎన్ఎస్ఎస్ పీఓల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: యూనివర్సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని.. తద్వారా బోధన, పరిశోధనల్లో అగ్రగామిగా నిలుస్తామని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, తరగతి గదులు, బోధనను పరిశీలించాక అధ్యాపకులతో సమావేశమయ్యారు. అధ్యాపకులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, తద్వారా వారు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు శ్రీనివాస్, రవి, కె.వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలి

ఖమ్మం రాపర్తినగర్: ప్రతీ విద్యార్థి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగస్వాములయ్యేలా అధ్యాపకులు అవగాహన కల్పించాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకునేలా అధ్యాపకులు చొరవ చూపాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో అత్యధికంగా కళాశాలలు కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. కరోనా కారణంగా ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడినా.. గత ఏడాది నుంచి విస్తృతం చేశామన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ప్రియదర్శిని, గాయత్రి డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు నవీన్‌బాబు, కె.సునీల్‌కుమార్, డైరెక్టర్ కుటుంబరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు విల్సన్, ఎస్.జయప్రద తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక సభకు సన్నద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ శత వసంత ఉత్సవాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనున్నందున పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. ఖమ్మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరగగా ఆయన మాట్లాడారు. వందేళ్ల కమ్యూనిస్టుల పోరాట చరిత్ర, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. లక్షలాది మందితో జరిగే బహిరంగసభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రజలు తరలివచ్చేలా ప్రత్యేక కళారూపాలతో ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. కాగా, బీసీ రిజర్వేషన్ల విషయంలో కొన్ని పార్టీలు దొంగాట ఆడుతున్నాయని ఆరోపించిన కూనంనేని... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కేలా జరిగే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పుస్తకాలు రెడీ..

- జిల్లాకు చేరిన 1,54,650 పార్ట్–2 పుస్తకాలు
- సాఫీగా సాగనున్న బోధన



పుస్తకాలను ఎమ్మార్సీలకు తరలిస్తున్న సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించడం ప్రహసనంలా సాగేది. విద్యార్థులు, నాయకులు తరచూ ఆందోళనలు చేపట్టాల్సి వచ్చేది. కొన్నిచోట్ల విద్యాసంవత్సరం మొదలయ్యాక రెండు, మూడు నెలలు గడిచినా అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు వచ్చేవి కాదు. కానీ కొన్నాళ్లుగా అలాంటి ఇక్కట్లు లేకుండా పుస్తకాలు అందుతున్నాయి. గత రెండేళ్లుగా పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తుండగా.. ఈసారి పార్ట్–2 పాఠ్య పుస్తకాలు సైతం సకాలంలోనే జిల్లాకు చేరుతున్నాయి.

ఒకే పుస్తకం.. రెండు భాగాలు

రాష్ట్ర ప్రభుత్వం పార్ట్–2 పాఠ్య పుస్తకాలను జిల్లాకు చేరవేయడం మొదలుపెట్టింది. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు కలిపి ఒకే సబ్జెక్టు పుస్తకాన్ని రెండు భాగాలుగా ముద్రిస్తున్నారు. ఓ పక్క తెలుగు, మరోపక్క ఇంగ్లిష్‌లో ముద్రించాల్సి రావడంతో రెండేళ్ల నుంచి ఈ విధానం అమలుచేస్తున్నారు. పార్ట్–1 పాఠ్య పుస్తకాలు ఏప్రిల్ నెలాఖరులోనే జిల్లాకు చేరగా పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పంపిణీ చేశారు. వీటి ఆధారంగా బోధన చివరి దశకు చేరడంతో పార్ట్–2 పుస్తకాలు చేరవేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు 1,303 ఉండగా సుమారు 68వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి వీరికి పార్ట్–2 పుస్తకాలు 1,66,600 అవసరమని జిల్లా అధికారులు నివేదిక సమర్పించారు. ఇందులో ఇప్పటికే 1,54,650 పాఠ్య పుస్తకాలు చేరగా, ఎమ్మార్సీలకు తరలించి అక్కడి నుంచి పాఠశాలలకు పంపిస్తున్నారు.

తీరనున్న ఇక్కట్లు

విద్యార్థులకు విద్యాసంవత్సరం మొదటల్లోనే పార్ట్–1 పాఠ్య పుస్తకాలు అందగా బోధన సాఫీగా సాగింది. వీటి ఆధారంగా బోధన చివరి దశకు చేరుతుండగానే పార్ట్–2 పుస్తకాలు పంపిస్తున్నారు. త్వరలోనే ఈ పుస్తకాలు ఎమ్మార్సీల నుంచి పాఠశాలలకు, అక్కడి నుంచి విద్యార్థులకు అందుతాయి. దీంతో పాఠ్య పుస్తకాల కొరత లేకుండా బోధన జరుగుతుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సెమినార్‌కు జిల్లా ఉపాధ్యాయుడు

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన – శిక్షణ మండలి సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సెమినార్‌లో తిరుమలాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి పాల్గొననున్నారు. 'విద్యార్థుల కెరీర్ ఎంపిక – కౌన్సెలింగ్ ప్రభావం' అంశంపై నిర్వహిస్తున్న ఈ సెమినార్‌కు ప్రభాకర్‌రెడ్డి 'ఈరోజు నేర్చుకోండి – రేపు నాయకత్వం వహించండి' శీర్షికతో రాసిన పరిశోధనా పత్రం ఎంపికైంది. రాష్ట్రవ్యాప్తంగా అందిన 105పరిశోధనా పత్రాల్లో 30పత్రాలను ఎంపిక చేయగా ప్రభాకర్‌రెడ్డి ఆర్టికల్ కూడా ఉంది. ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం జరిగే సెమినార్‌లో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం విజయకుమారి తదితరులు అభినందించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేలా గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సేల్స్ మేనేజర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు 25–40 లోపు వయసు కలిగి డిగ్రీ అర్హత ఉన్న వారు హాజరు కావాలని, వివరాలకు 96183 40376 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కేటింగ్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈనెల 8నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలికల అండర్–18 విభాగంలో జి.హలయ, అండర్–15లో టి.జ్ఞాన్వి, అండర్–8లో వీక్ష, బాలుర విభాగంలో అండర్–15 నుంచి డి.విధిలేష్, అండర్–6లో శిశిర్ కౌశల్, నిర్వాణ్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అంతేకాక హలయ, జ్ఞాన్వి, వీక్ష డిసెంబర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా, డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, కోచ్ సురేష్ మంగళవారం అభినందించారు.

అండర్–14 కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల విభాగంలో అండర్–14 కబడ్డీ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటే ల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జట్ల వివరాలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వై.రామారావు ప్రకటించగా.. ఈ జట్లు 16 నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు బి.ఓంకార్తీక్, పి.సంతోష్, డి.ధనుష్, వి.జయప్రకాష్, బి.ఆకా ష్, ఎ.మనోజ్, ఎ.అరుణ్, బి.అంజిబాబు, ఎ. శివ, ఎస్.గోపి, పి.బాబు, ఎస్.ప్రతీక్, బాలికల జట్టుకు సీహెచ్.గాయత్రి, డి.యామినిశ్రీ, పి.ప్ర వల్లిక,బి.వర్ష, పి.సింధుజ, ఎస్‌కే ఫరీదా,కె.భవా ని, పి.జాస్మిన్,ఎం.లిఖిత, కె.వినయశ్రీ, జి.సృజ న, ఎం.శ్రీజ ఎంపికయ్యారని వెల్లడించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

బోనకల్: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు ఇంకొందరికి ఉపాధి లభిస్తుందని ఇక్రిశాట్ సీనియర్ ఆఫీసర్ బానోతు శ్రీను తెలిపారు. బోనకల్ ఐకేపీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఇక్రిశాట్ అధికారులు స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమలకు ప్రభుత్వం నుండి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఈ రుణాలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ప్రధానంగా పండే పంటల ఆధారంగా ఆహార ఉత్పత్తులు తయారుచేసి అమ్ముతూ లాభాలు గడించేలా మహిళలను వీఓఏలు ప్రో త్సహించాలని సూచించారు. డీపీఎంలు శ్రీనివాస్, రాజారావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీఈఓ సాయిగణేష్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,600	2,650
ఏసీ మిర్చి	15,225	8,000
మిర్చి	8,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,400

అసౌకర్యాల నడుమే చదువులు

- నాలుగేళ్లయినా పూర్తికాని పాఠశాల భవన నిర్మాణం
- అయినా పట్టించుకోని యంత్రాంగం, పాలకులు
- యడవల్లిలో విద్యార్థులు, గ్రామస్తుల ధర్నా



పాఠశాల ఎదుట నిరసనలో విద్యార్థులు



యడవల్లిలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ముదిగొండ: అధికారుల పట్టింపులేనితనం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సమకూరడం లేదు. అదనపు తరగతి గదులతో పాటు భవనాల నిర్మాణాలకు రూ.కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెబుతున్నా సకాలంలో పూర్తికాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముదిగొండ మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలలు, ఐదు యూపీఎస్‌లు, 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉన్నాయి. వీటిల్లో 3,082 మంది చదువుకుంటుండగా.. పలు చోట్ల సౌకర్యాల లేమి వేధిస్తోంది. కమలాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో గదులు శిథిలావస్థకు చేరి సరిపడా లేకపోవడంతో చెట్ల కిందే బోధన సాగుతోంది. బాణాపురం పాఠశాలలోనూ అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. యడవల్లి, న్యూలక్ష్మీపురం, కమలాపురం, మేడేపల్లి, వల్లభి హైస్కూళ్ల ఆవరణలో చిన్నపాటి వర్షానికే వరద చేరుతోంది. వేసవి సెలవుల్లో ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు తీర్చాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవకపోవడంతోవిద్యాసంవత్సరం ప్రారంభమై నా లుగు నెలలు దాటినా సమస్యలు అలాగేమిగిలిపోయాయి.

ఒకే ప్రాంగణంలో రెండు స్కూళ్లు

మండలంలోని యడవల్లిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే జెడ్పీహెచ్‌ఎస్ కొనసాగుతోంది. ఫలితంగా తరగతి గదులే కాక మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆట స్థలం లేకపోవడం, మరో పక్క ఇరుకు, చీకటి గదులతో అవస్థలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యాన మరో ప్రాంతంలో కొత్త భవన నిర్మాణం నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టినా పూర్తికావడం లేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేక విద్యారుర్థులతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. టెంట్ వేసి ప్లకార్డులతో రెండు గంటల పాటు ధర్నా కొనసాగించారు. అంతేకాక గేట్లకు తాళం వేసి ఉపాధ్యాయులను సైతం లోపలకు వెళ్లనివ్వలేదు. చివరకు ఎంఈఓ రమణయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.శాంతి, ఎస్‌ఐ కృష్ణప్రసాద్ చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



యడవల్లిలో అసంపూర్తిగా ఉన్న గదులు, భవన నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కాంట్రాక్టర్‌కు బిల్లులు అందక పనులు చేయలేదని చెబుతున్నారు. కొన్ని పనులను అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టినా ఇంకొన్ని మిగిలిపోయాయి.

– రమణయ్య, ఎంఈఓ, ముదిగొండ

భవన నిర్మాణం పూర్తి చేయాలి



మా పిల్లలు ఈ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ఇక్కడ సమస్యలు ఉన్నాయని మేడేపల్లికి పంపించాం. కానీ రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో మళ్లీ తీసుకొచ్చాం. భవన నిర్మాణం పూర్తిచేస్తేనే విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతాయి.

– భూసెర్ల శేఖర్, యడవల్లి

ఇబ్బందిగా ఉంది...



మేడేపల్లిలో 8, 9వ తరగతులు చదివాను. అక్కడకు వెళ్లిరావడం ఇబ్బంది అయిందని పదో తరగతి యడవల్లి పాఠశాలలో చేరా. కానీ గదులు సరిపడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. స్కూల్ భవన నిర్మాణం పూర్తి చేస్తే మాకు సమస్యలు ఉండవు.

– నాయిని వేణు, పదో తరగతి

ఇరుకు గదుల్లో కష్టాలు



మా గ్రామంలోనే చదువు పూర్తి చేద్దామనుకుంటే నాలుగేళ్ల నుంచి స్కూల్ భవనం పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నాం. మూత్రశాలలు కూడా సరిగా లేవు. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికి యూనిఫామ్ ఒకే జత మాత్రమే అందింది.

– బాలిబోయిన చరణ్, పదో తరగతి

పకడ్బందీగా చట్టం అమలు

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలయ్యేలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఆమె ఈ చట్టం కింద జారీ చేసిన అనుమతులు, రెన్యువల్స్ కోసం వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేయడమే కాక పోలీసుల అభిప్రాయం తీసుకున్నాక సరైన ఆధారాలతో కౌంటర్లు దాఖలు చేయాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు నిబంధనల ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. ఇంకా ఈ సమావేశంలో అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చందునాయక్, ఐఎంఏ అధ్యక్షులు రెహానాబేగం, అధికారులు వెంకటరమణ, రామారావు, నరేందర్, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జనరల్ ఆస్పత్రిలో తనిఖీ

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం తనిఖీ చేశారు. పోషకాహార లోపంతో జన్మించిన చిన్నారులకు వైద్యసేవలు అందించే ఎన్‌ఆర్‌సీ వార్డుతో పరిశీలించి సేవలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, డయాగ్నస్టిక్ హబ్‌లో పరీక్షలు, సదరమ్ క్యాంపుల నిర్వహణ, మరుగుదొడ్ల మరమ్మతులను పరిశీలించి సూచనలు చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

నిధుల పక్కదారిపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న రీజినల్ డైరెక్టర్ మసూద్

వైరా: వైరా మున్సిపాలిటీ ఉద్యోగి తన ఖాతాలోకి జనరల్ ఫండ్ నిధులు బదలాయించుకున్న ఘటనపై వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ విచారణ చేపట్టారు. ఈ విషయమై 10వ తేదీన 'సాక్షి'లో 'ఉద్యోగి ఖాతాల్లోకి మున్సిపల్ నిధులు' శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఈమేరకు వైరా మున్సిపాలిటీకి మంగళవారం వచ్చిన షాహిద్ మసూద్ నాలుగు గంటలకు పైగా రికార్డులు పరిశీలించారు. అకౌంటెంట్ ఏ.వెంకటేశ్వరరావును పిలిపించి కమిషనర్ యు.గురులింగం సమక్షాన విచారణ చేపట్టారు. ఎలాంటి రికార్డులు లేకుండానే 30 చెక్కుల ద్వారా రూ.52 లక్షలకు తన ఖాతాలోకి బదలాయించుకున్నట్లు గుర్తించారు. జనరల్ ఫండ్‌తో పాటుగా 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా పక్కదారి పట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కనీసం నిబంధనలు పాటించకుండా చెక్కులు రాసినా గత కమిషనర్ వేణు ప్రశ్నించకపోవడం, ఫైళ్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడంతో రీజినల్ డైరెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు నిగ్గుతేల్చేలా ఆడిట్ చేయించాలని ఆయన కమిషనర్ గురులింగంను ఆదేశించారు. అంతేకాక నిధుల రికవరీ, క్రిమినల్ చర్యలు తీసుకోవడంపై చర్చించారు.

మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న మరమ్మతులు త్వరగా పూర్తిచేయించా లని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవి బాబు సూచించారు. కాలేజీలో పనులను మంగళవారం పరిశీలించిన ఆయన సూచనలు చేశారు. అలాగే, ఫిజిక్స్ వాలా ఆధ్వర్యాన విద్యార్థులకు జరుగుతున్న బోధనపై ఆరా తీశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి, అమ్మ ఆదర్శ కళా శాల చైర్మన్ జయమ్మతో పాటు అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖలో ఏడు పనులకు ఆమోదం

ఖమ్మంఅర్బన్: జిల్లా నుంచి జలవనరుల శాఖ ద్వారా ప్రతిపాదించిన ఏడు పనులకు రాష్ట్ర స్థాయి పనుల ఆమోద కమిటీ అనుమతించింది. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో సుమారు రూ.3 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించినట్లు తెలిసింది. ఇందులో ఖమ్మం సర్కిల్ నుంచి ఆరు, కల్లూరు సర్కిల్ పరిధిలో ఒక పని ఉన్నాయి. కాల్వ కట్టల పటిష్టత, కంపచెట్లు తొలగింపు, షట్టర్లు, యూటీల మరమ్మతులు, పూడికతీత వంటి పనులు ఇందులో ఉండగా, త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టే అవకాశముంది.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

కూసుమంచి: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎన్.వీ.వేణు గోపాలాచారి తెలిపారు. కూసుమంచి సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు అంతరాయాలు లేని సేవలందించేలా సదస్సులు ఏర్పాటుచేస్తూ ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఫోరం సభ్యులు రమేష్, దేవేందర్, రామారావు తదితరులు పాల్గొనగా సర్వీసుల పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఓల్టేజీ హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు అందాయి. అనంతరం వీటి పరిష్కారంపై చర్చించారు. ఎస్‌ఈ శ్రీనివాసాచారి, డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యా నాయక్, ఏఈలు పాల్గొన్నారు.

మహిళ, శిశు సంక్షేమమే లక్ష్యం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆర్‌జేడీ, డీడబ్ల్యూఓ

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మహిళలు, శిశువుల సంక్షేమమే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఐసీడీఎస్ వరంగల్ ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి సూచించారు. కల్లూరులో మంగళవారం నిర్వహించిన పోషణమాసం సమావేశంలో ఆర్‌జేడీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులను నిరంతరం పరిశీలిస్తూ పోషకాహార లోపం ఎదురుకాకుండా చూడాలని తెలిపారు. గర్భిణీగా తేలగానే పేరు నమోదు చేసి సలహాలు ఇవ్వాలని చెప్పారు. అలాగే, చిన్నారులకు బోధన, తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత సమస్య ఎదురుకాదని చెప్పారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినీత్, సీడీపీఓ నిర్మలజ్యోతి, ఏసీడీపీఓ రత్తయ్య, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సుజాత, భవాని, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

టన్ను చెరుకు ధర రూ.3,578



వివరాలు వెల్లడిస్తున్న ఎండీ నామా కృష్ణయ్య

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో టన్ను చెరుకు ధర రూ.3,578.35గా నిర్ణయించామని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య తెలిపారు. ఫ్యాక్టరీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.210 అదనంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతేకాక రైతులకు మూడు టన్నుల విత్తనం, పిలకతోటలో ఖాళీలు పూరించడానికి 500 మొక్కలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులకు వరుసగా రూ.లక్ష, రూ.50వేలు, రూ.25వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కాగా, ఇతర రాష్ట్రాల మాదిరి ఇక్కడ కూడా టన్ను చెరుకుకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ ఏడాది 85వేల మెట్రిక్ టన్నుల చెరుకు గానుగ ఆడించడం లక్ష్యం కాగా, డిసెంబర్ మొదట్లో క్రషింగ్ ప్రారంభిస్తామని కృష్ణయ్య చెప్పారు. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, అప్పారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'పేట' చెరువు అభివృద్ధికి రూ.4.86 కోట్లు



చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం మామునూరులోని పేట చెరువును పర్యాటకంగా అభివృద్ధిచేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ. 4.86 కోట్లు మంజూరు చేశారని మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. చెరువును టూరిజం శాఖ డీఈ ఎస్.రామకృష్ణ, ఏఈ నరేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు మారాబత్తుల మోహన్‌రావు, గంతాల లక్ష్మారావు, గంగారపు కృష్ణారావు, బండారు రామారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పతక విజేతలను అభినందించిన సీపీ



పతకాలు సాధించిన ఉద్యోగులతో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: రాష్ట్ర అవతరణ దినోత్సవంతో పాటు వివిధ సందర్భాల్లో రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన పోలీస్ సేవా పతకాలకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉద్యోగులు ఎంపికయ్యారు. కమిషనరేట్ నుంచి 82మంది పతకాలు అందుకోగా పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ మెరుగైన పనితీరు కనబర్చాలని సూచించారు. పతకాలు అందుకున్న వారిలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, సాంబరాజు తదితరులు ఉండగా, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, కామరాజు పాల్గొన్నారు.

ఆరు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



మృతదేహంతో అన్నం ఫౌండేషన్ సభ్యులు, పోలీసులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లి బ్రిడ్జి సమీపాన సాగర్ కాల్వలో ఆరు రోజుల క్రితం స్నానం కోసం వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఖమ్మం వైఎస్సార్‌నగర్‌కు చెందిన ఎలగందుల వెంకన్న(60) కాల్వలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్ సమీపాన కాల్వలో మంగళవారమాయన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన బయటకు తీసి ఖమ్మం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

600 క్వింటాళ్ల బియ్యం సీజ్

నిర్ధారణ కోసం ల్యాబ్‌కు శాంపిళ్లు

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరులో ఓ రైస్ మిల్లులో నిల్వ ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు సీజ్ చేశారు. రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ ఆధ్వర్యాన మంగళవారం సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 600 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు పీడీఎస్ బియ్యమా, కాదా అని నిర్ధారణ కోసం శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా, భారీగా బియ్యం పట్టుబడడంతో ఎక్కడ సేకరించారు, ఎవరు కొనుగోలు చేశారనే కోణాల్లో ఆరా తీస్తున్నారని తెలిసింది. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద ప్రేమపెళ్లి విషయమై సోమవారం జరుగుతున్న అడ్డుకోబోయిన హెడ్‌కానిస్టేబుల్ బాలుపై దాడికి పాల్పడిన వారిని గుర్తించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన ఆంగోత్ వివేక్, గుగులోత్ నవీన్, నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన భూక్యా శంకర్‌ను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ్, ఎస్‌ఐ కె.జగదీష్ తెలిపారు.

రుణం పేరుతో నగదు స్వాహాకు యత్నం

రఘునాథపాలెం: రూ.5లక్షల రుణం మంజూరైందని చెబుతూ ఫీజు కింద రూ.49,500 నగదును సైబర్ నేరగాళ్లు స్వాహా చేసేందుకు యత్నించారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన మాలోత్ అశోక్‌కు గత నెల 20న ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.5 లక్షల రుణం మంజూరైందని నమ్మబలికారు. అయితే, ప్రాసెసింగ్ ఫీజుగా రూ49,400 చెల్లించాలని చెప్పడంతో పాటు ఆన్‌లైన్‌లో పంపించాడు. ఆతర్వాత సదరు వ్యక్తుల ఫోన్ స్విచాఫ్ చేయడంతో మోసపోయినట్లు గ్రహించిన అశోక్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రూ.35 వేల నగదు విత్‌డ్రా చేయకుండా అడ్డుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53 ; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్ఆర్ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో రోజు **ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి**జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ **కేఎల్ రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ**శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ 2 **వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది. **రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన కుల్దీప్ యాదవ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించాడు. కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్ విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390; **భారత్ రెండో** ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) **58; సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. **వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజిత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్



మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జుల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

‘‘నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా’’ అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్‌వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు’’ అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

‘‘మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ట కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...’’ అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ‘‘ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డీ... కబడ్డీ



● ధృవ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ- ‘‘1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డీ నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను’’ అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ


‘‘నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు’’ అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ- ‘‘ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది’’ అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ- ‘‘టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను’’ అని చెప్పారు. ‘‘కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్



● వినోద్ వర్మ, జయశంకర్

‘‘అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం’’ అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ- ‘‘మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది’’ అని పేర్కొన్నారు. ‘‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్’’ అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

‘‘ప్రస్తుత సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ‘‘సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది’’ అని యూనిట్ పేర్కొంది.